క్లుప్తంగా

తప్పిన ప్రమాదం



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

పెనుకొండ: మండలంలోని రబ్బక్ ఫ్యాక్టరీ సమీపంలో బుధవారం పెను ప్రమాదం తప్పింది. పెనుకొండ వైపు నుంచి వస్తున్న కారు రబ్బర్ ఫ్యాక్టరీ సమీపంలో లారీని ఢీకొనడంతో కారు దెబ్బతింది. అయితే అందులో ప్రయాణిస్తున్న వారు ప్రాణాలతో బయట పడ్డారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

మెరుగైన సేవలు అందించాలి



సమీక్షిస్తున్న ట్రాన్స్‌కో టెక్నికల్ డైరెక్టర్ గురువయ్య

హిందూపురం: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలను అందించేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలున్నాయని, ఏమాత్రం నిర్లక్ష్యానికి తావివ్వరాదని ట్రాన్స్‌కో టెక్నికల్ డైరెక్టర్ గురువయ్య అన్నారు. బుధవారం హిందూపురం డివిజన్ విద్యుత్ సేవలపై ట్రాన్స్ కో ఆఫీసులో అధికారులతో సమీక్ష నిర్వహించారు. 33/11 కె.వి సబ్ స్టేషన్ లైన్లలో అంతరాయాలు తగ్గించాలన్నారు. విద్యుత్ సరఫరాలో మరమ్మతులకు అవసరమైన సామగ్రి అందించేందుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు



గాయపడిన శబరి

హిందూపురం: పట్టణ పరిధిలోని సూరప్పకట్ట వద్ద శబరి అనే యువకుడిపై నలుగురు దాడి చేయడంతో గాయాలపాలై చికిత్స పొందుతున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. మెయిన్‌బజారులో ద్విచక్ర వాహనాలు వెళ్లే విషయంలో అడ్డు తగిలాడని గొడవపడ్డారన్నారు. సూరప్పకట్ట వద్దకు వచ్చిన మణికంఠ, సాయిచిన్న, మహేంద్ర, ఆది కలిసి శబరిపై దాడి చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నామన్నారు.

ద్విచక్ర వాహనాల ఢీ

పరిగి:మండల కేంద్రం పరిగిలో బుధవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు గాయపడ్డారు. పరిగికి చెందిన జయలక్ష్మీ, అక్షయ్ ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. మరో ద్విచక్ర వాహనంపై శ్రీధర్ అనే వ్యక్తి వచ్చారు. ఎదురెదురుగా వాహనాలు ఢీకొనడంతో జయలక్ష్మీ, శ్రీధర్ గాయపడ్డారు. వీరితో పాటూ అక్షయ్‌కూ గాయాలయ్యాయి. ముగ్గురిని హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా ప్రదేశాన్ని పరిశీలించారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపారు.

స్మార్ట్ మీటర్లు వద్దు



ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

పెనుకొండ: స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి రైతాంగం నడ్డి విరచవద్దని సీపీఐ నాయకులు బుధవారం పట్టణంలోని విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. నియోజకవర్గ కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ రైతులకు స్మార్ట్ మీటర్లు బిగించి వారి జీవితాలతో చెలగాటమాడవద్దన్నారు. రైతులకు ఎలాంటి అన్యాయం చేసినా పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు



మాట్లాడుతున్న ఏఓ నాగరాజు

అగళి: వివిధ రకాల పంటల్లో మోతాదుకు మించి రసాయన ఎరువులను వినియోగించవద్దని మండల వ్యవసాయశాఖ అధికారి నాగరాజు సూచించారు. బుధవారం మండల పరిధిలో అగళి, రాగేలింగనపల్లిలో పోలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి నాగరాజు మాట్లాడుతూ.. నానో యూరియా, నానో డీఏపీ, జీవన ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు, ప్రాముఖ్యత వాటి ప్రయోజనాలను తెలిపారు. రైతులు సేంద్రియ పద్ధతిని అవలంభించాలని, రసాయనిక ఎరువులు పూర్తిగా తగ్గించి నాణ్యమైన పంటను పొందటానికి సేంద్రియ విధానం ఎంతో మేలు చేస్తుందన్నారు.

ఇంకుడు గుంత.. బిల్లుల చింత

- ఉపాధి కింద సోక్‌పిట్ నిర్మాణాలు పూర్తిచేసిన లబ్ధిదారులు
- ఐదారు నెలలుగా బిల్లులు అందక తీవ్ర ఇబ్బందులు



సోక్‌పిట్ పూర్తి చేసినట్లు చూపుతున్న లబ్ధిదారురాలు



గౌరిగానిపల్లి వద్ద పూర్తయిన ఇంకుడు గుంత

లేపాక్షి: జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం కింద ఇంకుడు గుంతలు నిర్మించుకున్న లబ్ధిదారులు బిల్లులు మంజూరు కాక అవస్థలు పడుతున్నారు. పనులు పూర్తి చేసి ఐదారు నెలలు అయినా డబ్బులు జమ చేయకపోవడంతో రోజూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షణ చేస్తున్నారు.

ఉపాధి కింద నిధుల మంజూరు

డ్రైనేజీలు ఉన్నా లేకపోయిన రోడ్ల వెంబడి మురుగు నీరు వెళ్లకుండా ఉండేందుకు ప్రభుత్వం ఇంకుడు గుంతలను మంజూరు చేసింది. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా, ఆరోగ్యంగా ఉండటం కోసం ఈ సోప్‌పిట్లు ఎంతగానో ఉపయోగపడతాయి. ఉపాధి నిధుల కింద సోక్‌పిట్ నిర్మించుకోవడం కోసం ఒక్కో లబ్ధిదారుడికి రూ. 5,300లు మంజూరు చేసింది. ఈ సోక్‌పిట్‌ను 1.5"1.5 మీటర్ల సైజులో లబ్ధిదారుడు ఇంటిముందు నిర్మించుకుంటున్నారు. మట్టి పనులకు రూ.500, మెటీరియల్‌కు రూ.5 వేలు నిధులు చెల్లిస్తారు. సోక్‌పిట్ ను లబ్ధిదారుడే సొంతంగా నిర్మించుకుంటే ఉపాధి నిధులు వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు.

598 ఇంకుడు గుంతల మంజూరు

లేపాక్షి మండలంలో 364, హిందూపురం రూరల్ మండలంలో 159, చిలమత్తూరు మండలంలో 75 మంది లబ్ధిదారులకు ఇంకుడు గుంతలు మంజూరయ్యాయి. అయితే లేపాక్షిలో 169, హిందూపురం రూరల్‌లో 71, చిలమత్తూరులో 62 మాత్రమే పూర్తయ్యాయని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. పూర్తయిన ఇంకుడు గుంతలకు ఐదారు నెలలు గడిచినా ఉపాధి బిల్లులు మంజూరు కాలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ఉపాధి నుంచి వచ్చే నిధులు కాకుండా లబ్ధిదారుడు చేతి నుంచి రూ. 2 వేల నుంచి రూ.3 వేల వరకూ ఖర్చు చేశామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి బిల్లులు సకాలంలో మంజూరు చేయాలని కోరుతున్నారు.

బంగారు సొత్తులు కుదువ పెట్టాను



మా ఇంటికి ఉపాధి హామీ పథకం కింద సోక్‌పిట్ మంజూరు అయింది. వెంటనే నిర్మించుకుంటే బిల్లులు మంజూరు చేస్తామని తెలపడంతో బంగారు సొత్తులను కుదువ పెట్టి పూర్తి చేశాము. ఐదు నెలలు కావస్తున్న బిల్లులు మంజూరు చేయలేదు. బిల్లులు కోసం అధికారులు, కార్యాలయాల చుట్టు తిరిగినా ఫలితం లేక పోయింది. ఇప్పటికైనా వెంటనే బిల్లులు మంజూరు చేయాలి.

–ఆనందమ్మ, గౌరిగానిపల్లి

6 నెలలుగా బిల్లులు అందలేదు



నేను ఇంకుడు గుంత పనులు పూర్తి చేసినప్పటికీ 6 నెలలుగా దానికి సంబంధించిన బిల్లు అందలేదు. సకాలంలో బిల్లులు అందజేస్తారని మిగతా పనులు పక్కన బెట్టి ఈ పనులు పూర్తి చేసుకున్నాను. ప్రభుత్వం ఇచ్చే బిల్లు కాకుండా అదనంగా రూ. 3 వేలు ఖర్చు పెట్టుకున్నాను. బిల్లులు మంజూరు కాలేదని అధికారులను అడిగితే ఈరోజు.. రేపు అని సమాధానం ఇస్తున్నారు గాని బిల్లులు మాత్రం అందలేదన్నారు.

– నారాయణప్ప, గౌరిగానిపల్లి

నేడు 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ'

అమరాపురం: మండల పరిధిలోని వి.అగ్రహారం, అమరాపురం పంచాయతీ కేంద్రాల్లో గురువారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ తెలిపారు. 10 గంటలకు వి.అగ్రహారంలో, మధ్యాహ్నం 12 గంటలకు అమరాపురంలో నిర్వహిస్తామన్నారు.

గుడిబండ: మండలం పరిధిలోని ఎస్ రాయాపురం, కొంకల్లు గ్రామంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్ రాయాపురంలో ఉదయం 11 గంటలకు, కొంకల్లులో మధ్యాహ్నం 2 గంటలకు కార్యక్రమం జరుగుతుందన్నారు.

రేపు మడకశిరలో...

మడకశిర: పట్టణంలోని 7, 9, 10, 11, 12వ వార్డుల పరిధిలో శుక్రవారం ఉదయం 10 గంటలకు తేరువీధిలోని వేంకటరమణస్వామి ఆలయం వద్ద బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ వాల్మీకి సతీష్‌కుమార్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉద్యోగ కల్పన దిశగా అడుగేయాలి



మాట్లాడుతున్న జిల్లా పరిశ్రమల అధికారి నాగరాజు

హిందూపురం టౌన్: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ర్యాంప్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తలకు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మేధో సంపత్తి హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిశ్రమల అధికారి నాగరాజు మాట్లాడుతూ మేధా సంపత్తి, హక్కులు, ఎలా రిజిస్టర్ చేసుకోవాలి తదితర వాటిపై వివరించారు. చదువుకున్న యువకులు ప్రభుత్వ ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూడకుండా, పరిశ్రమలు ఏర్పాటు చేసి పది మందికి ఉపాధి కల్పించాలన్నారు. మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ మాట్లాడుతూ పరిశ్రమలను స్థాపించడానికి ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం సహాయ సహకారాలను అందిస్తుందన్నారు.

భవిత కేంద్రంలో మెడికల్ క్యాంప్



మాట్లాడుతున్న ఆనందబాబు

మడకశిర: పట్టణంలోని భవిత కేంద్రంలో బుధవారం అలింకో ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్, ఐఈ కోఆర్డినేటర్ ఆనంద్‌బాబు, ఎంఈఓలు శ్రీనివాస్‌భాస్కర్, నరసింహమూర్తి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ భవిత కేంద్రంలోని విద్యార్థులకు కావాల్సిన ఉపకరణాలను అందించడానికి అసెస్మెంట్ చేసి ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు, ఫిజియోథెరపీ సిబ్బంది, మడకశిర, అగళి, అమరాపురం, గుడిబంగ, రొళ్ల మండలాలకు సంబంధించిన భవిత కేంద్రాల ప్రత్యేక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోసాలే ష్యూరిటీ - అబద్ధాలే గ్యారెంటీ

- బాబు పాలనపై ప్రజలు తిరగబడటం ఖాయం
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



అగళి: మోసం గ్యారెంటీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు



గుడిబండ: మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, పార్టీ శ్రేణులు

గుడిబండ: 'ఎన్నికల సమయంలో ఎన్నో హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు హామీలందరినీ అమలు చేయకుండా ప్రజలందరినీ మభ్యపెట్టారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత వచ్చింది' అని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప అన్నారు. మండల పరిధిలోని జంబులబండ, మందలపల్లిలో బుధవారం 'బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈరలక్కప్ప మాట్లాడుతూ బాబు పాలనపై త్వరలోనే ప్రజలు తిరగబడే రోజులు వస్తాయన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్ 2.0లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అధిక ప్రాధాన్యత ఇస్తారన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజు, రాష్ట్ర కార్యదర్శి మధుమతిరెడ్డి, రాష్ట్ర ఎస్టీ జాయింట్ సెక్రెటరీ గిరిధర్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు చంద్రప్ప, సర్పంచ్ అశ్వత్, వార్డు మెంబర్లు రామక్రిష్టప్ప, నటరాజు, అశ్వత్, నాయకులు మల్లేష్, జబీవుల్లా, రమేష్, బోజప్ప, పాండు, ఈరన్న, గిరిధర్, చంద్రశేఖర్, లింగరాజు, చంద్రప్ప, చిత్తప్ప, జగన్నాథ్, ముద్దలింగప్ప, రాజు, హనుమంతరాయుడు తదితరులు పాల్గొన్నారు.

అగళి: మండల పరిధిలోని ఆలూడి, హళ్లికేర పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్ అధ్యక్షతన 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీపై కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప ,రాష్ట్ర కార్యదర్శి మధుమతిరెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీలు ఇస్తారే తప్ప.. వాటిని అమలు చేయరని ఎద్దేవా చేశారు. ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్ముకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు అనడం సిగ్గుచేటన్నారు. హామీలు ఇచ్చినప్పుడు ఆర్థిక పరిస్థితి తెలియదా అని ప్రశ్నించారు.

కూటమి మోసాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లండి



మడకశిర: పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మడకశిర: కూటమి మోసాలను వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని మడకశిర మున్సిపాలిటీ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ భారతీరెడ్డి దేశాయి సూచించారు. బుధవారం పట్టణంలోని 18, 19, 20వ వార్డుల పరిధిలో పట్టణ కన్వీనర్ వాల్మీకి సతీష్‌కుమార్ అధ్యక్షతన బేగార్లపల్లి క్రాస్‌లో జరిగిన 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమంలో ఆమెతో పాటు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. భారతీ రెడ్డి దేశాయి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, సమయం కోసం వేచి చూస్తున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ వాల్మీకి సతీష్‌కుమార్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, నాయకులు ఓంకుమార్, ఫకృద్దీన్, సైఫుల్లా, అంజలి, ప్రసాద్, మారుతీ, నాగేంద్ర, దొడ్డమాళప్ప, నవీన్, మణి, సుధీర్‌రెడ్డి, గోపి, ధను, రఘునందన్, వెంకటేశ్, నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలోకి చేరిక

మండల పరిధిలోని హెచ్‌డీ హళ్లికి చెందిన మారుతీ, రంగనాథ కాంగ్రెస్ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. మధుమతిరెడ్డి , మండల అబ్జర్వర్ సాయి లీల కండువా వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు మహేంద్రప్ప, సర్పంచులు శివకుమార్, ముద్దరాజు, రామకృష్ణప్ప, నాయకులు బసవరాజు, సతీస్, శినప్ప, నాటరాజు, ఈరన్న, లక్ష్మీనారసప్ప, హనుమంతరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



తీవ్రంగా గాయపడిన నాగరాజప్ప

పావగడ: పట్టణంలోని ఎంఏజీ సర్కిల్‌లో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్థానిక వ్యవసాయశాఖ నివృత్త ఉద్యోగి నాగరాజప్ప తీవ్రంగా గాయపడ్డారు. నాగరాజప్ప ద్విచక్ర వాహనంలో పావగడ వైపు వస్తుండగా వెనుక వైపు నుంచి వేగంగా వచ్చిన బొలెరో ఢీ కొనడంతో నాగరాజప్ప కిందకుపడి తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స కోసం బెంగుళూరు తరలించారు.

రుణాలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఏపీఎం ముత్యాలప్ప

అమరాపురం: మండలంలోని మహిళా సంఘాల సభ్యులు బ్యాంకు, స్త్రీనిధి, తదితర వాటి నుంచి తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఏసీ.నాగరాజు, ఏపీఎం ముత్యాలప్ప పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో వీఓఏలు, గ్రామ సమైక్య సంఘం లీడర్లు, సీసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సభ్యురాలు పొదుపు చేయడంతో పాటు తాము తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలన్నారు.

ఆర్డీటీ లైసెన్స్ రెన్యూవల్ చేయాలి



రొళ్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న మహిళలు

పరిగి: ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు కర్నూలు, తెలంగాణ రాష్ట్రంలో అనేక విధాలుగా సేవలందిస్తున్న ఆర్డీటీ పరిరక్షణకై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలని బీచిగానిపల్లి గ్రామస్తులు కోరారు. మండల కేంద్రం పరిగిలో బుధవారం ఆర్డీటీకి అండగా బీచిగానిపల్లి గ్రామస్తులు తహసీల్దారు హసీనా సుల్తానాకు వినతిపత్రాన్ని అందించారు. అంతకు ముందు పరిగి మండల కేంద్రంలో ర్యాలీని నిర్వహించారు.

గుడిబండ: కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యూవల్ చేయాలని స్థానికులు పెద్ద ఎత్తున బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దారు కల్యాణ్ చక్రవర్తికి డిమండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. పేదలకు అందిస్తున్న సేవలను గుర్తించి ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలన్నారు.

రొళ్ల: కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించి ఆర్డీటీ సేవలను యథావిధిగా కొనసాగించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, ఆర్డీటీ ఏటీఎల్ ఓబులేసు తదితరులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఆర్డీటీ సంఘ సభ్యులతో పాటు, ఆర్డీటీ సిబ్బందితో కలిసి పట్టణంలోని గ్రామ పురవీధుల గుండా బస్టాండ్ ఆవరణం ర్యాలీగా చేరుకుని మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయం చేరుకుని తహసీల్దార్ షేక్షావలికి వినతిపత్రం అందజేశారు.

ముర్రుపాలు బిడ్డకు శ్రీరామరక్ష



సోమందేపల్లి: ర్యాలీలో పాల్గొన్న అంగన్వాడీ కార్యకర్తలు



కల్లుమర్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. సీడీపీఓ శాంత లక్ష్మి మాట్లాడుతూ చంటి బిడ్డకు ముర్ర పాలు అమృతంతో సమానం అన్నారు. సూపర్‌వైజర్లు శుభారాణి, లలితా, మంజుల, శంకరమ్మ సిబ్బంది పాల్గొన్నారు.

రొళ్ల: అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి ముర్రపాలు శ్రీరామ రక్ష అని సీడీపీఓ నాగమల్లేశ్వరి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం సమావేశం మందిరంలో స్థానిక తహసీల్దార్ షేక్షావలితో కలిసి తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లుతో పాటు గర్భిణులు, బాలింతలు తదితరులతో కలిసి తల్లి ముర్రుపాల ప్రాముఖ్యత పై అవగాహన కల్పించారు.

అమరాపురం: అపుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు పట్టడం శ్రేయస్కరమని సీడీపీఓ గంగరత్న, హెచ్‌ఎం.లక్ష్మీనారాయణ, సూపర్‌వైజర్ నన్నమ్మ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని వి. అగ్రహారంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు తల్లిపాల ఆవశ్యకతను తెలియజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు అనసూయ, నరసమ్మ, లక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: మండల పరిధిలోని కల్లుమర్రిలోని 1, 2 అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది తల్లులతో కలిసి తల్లి పాలు ప్రాముఖ్యతపై వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏఎన్‌ఎం శ్రీవాణి మాట్లాడుతూ తల్లి పాలు పిల్లలకు దివ్య ఔషధమని, పుట్టిన బిడ్డకు ముర్రిపాలు తాగించడం వల్ల వారిలో రోగనిరోధక శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. కాన్పయిన వెంటనే తల్లి బిడ్డకు ముర్రిపాలు తాగించాలన్నారు. దీంతో మరణాలు తగ్గడానికి అవకాశం ఉంటుందన్నారు. గర్భిణిలు క్రమం తప్పకుండా టీకాలు వేయించుకోవాలన్నారు.

కట్టెల స్థానంలో విద్యుత్ స్తంభాలు



రొద్దం: కట్టెల స్థానంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసిన దృశ్యం

రొద్దం: మండల కేంద్రంలోని రొద్దకాంబదేవి ఆలయం వెనుక భాగాన ఉన్న వ్యవసాయ బోర్లకు రైతులు కట్టెలపై విద్యుత్ తీగలు ఏర్పాటు చేసుకున్నారు. దీనిపై 'కట్టెలే కరెంటు స్తంభాలు' అన్న శీర్షికన సాక్షిలో బుధవారం కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ట్రాన్స్‌కో అధికారులు కట్టెల స్థానంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. వేళాడుతూ చేతికందే ఎత్తులో ప్రమాదకరంగా ఉన్న ఎల్టీ విద్యుత్ వైర్లను పైకి లాగించి, సమస్య పరిష్కరించినట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. రైతులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ వైరుకు మరమ్మతు



మడకశిర: చెట్టు కొమ్మలను కొట్టించి వైరుకు మరమ్మతు చేసిన దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని మెళవాయి బస్టాండ్ సమీపంలో చెట్టు కొమ్మల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైరును విద్యుత్‌శాఖ అధికారులు సరిచేశారు. 'పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికన బుధవారం 'సాక్షి'లో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన విద్యుత్‌శాఖ అధికారులు చెట్టు కొమ్మలను కొట్టించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైరుకు మరమ్మతు చేశారు. ట్రాన్స్‌కో ఏఈ విశ్వనాథ్, లైన్ ఇన్‌స్పెక్టర్ జయరామ్‌నాయక్, లైన్‌మెన్ బాలకృష్ణ, సిబ్బంది ఉన్నారు.